batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

8 సెప్టెంబర్ 2026
మంగళవారం

జైలులో సేవలు కావాలా

## లంచం ఇవ్వాల్సిందే..!

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జైలర్

జైలు పెట్రోల్ బంక్ ఆపరేటర్ ద్వారా..



2 లో

## ఆర్మూర్ ఏడిఎం విభాగం

# అస్తవ్యస్తం...?

ఈఆర్ఓ నుంచి ఏడిఎంలోకి ఎస్ఏ, వాచ్ మెన్

ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే వలస ..!

కంప్యూటర్ సీట్లో నైట్ వాచ్ మెన్

రాత్రి కాపలా హుళక్కే..!

గతంలో ఈఆర్ఓ అగ్గిపాలు




నిజామాబాద్, బతుకమ్మ:విద్యుత్ శాఖలో వింత పోకడలు కనిపిస్తున్నట్లు తెలు స్తోంది. పాలన గాడి తప్పిందేమో అన్నట్లుగా తయారయ్యింది ఆర్మూర్ డివిజన్ పరిస్థితి. ఉన్నతాధికారి పర్యవేక్షణ కొరవడడంతోనే సిబ్బంది ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టించుకునేవారు కరువవడంతో ఏడిఎం విభాగం అస్తవ్యస్తంగా మారిందనే చర్చ డివిజన్ పరిధిలో జరుగుతోంది. ముఖ గుర్తింపు హాజరు ఉన్నప్పటికీ ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. పాలన విభాగంలో జూనియర్ అసిస్టెంట్లు ఇద్దరు, సీనియర్ అసిస్టెంట్లు ఇద్దరు ఉండాల్సిన చోట ఒక్కక్కరే ఉన్నారు.

పని భారం ఎక్కువవుతుందని పక్కనే ఉన్న ఈఆర్ఓ నుంచి సీనియర్ అసిస్టెంట్ ను తెప్పించుకున్నారు. దీనికి తోడుగా ఇదే విభాగంలో నైట్ వాచ్ మెన్ ను సైతం ఏడిఎంకు తెప్పించి కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేయించుకుంటున్నారని డివిజన్ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇందులో విధులు నిర్వహించే జెఏఓ పదవి విరమణ పొందడంతో, పాస్ ఆర్డర్ జెఏఓ కు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఏడిఎంలో కీలక పోస్టులో ఉన్న అధికారి డివిజన్ స్థాయి ఉద్యోగులందరికి అందుబాటులో ఉండాలని, క్రీడల పేరిట తరచూ దుమ్మాలు కొట్టే అధికారికి ఇంచార్జ్ బాధ్యతలు ఇవ్వడం అవసరమా అనే ప్రశ్నలు డివిజన్ స్థాయిలో ఉత్పన్నమవుతున్నాయి.

### ఉత్తర్వులు లేకుండానే..!

ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే ఈఆర్ఓ నుంచి పాలనా విభాగంలో సీనియర్ అసిస్టెంట్, నైట్ వాచ్ మెన్ (రాత్రి కాపలదారుడు) విధులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని, అధికారుల సహకారంతోనే ఇదంతా నడుస్తోం దని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వీరు లేకపోవడం వల్ల ఈఆర్ఓ లో పని కుంటుప డుతోందని సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఏడిఎంలో దినమంతా పని చేశాననే వంకతో నైట్ వాచ్ మెన్ రాత్రి కాపలా పనికి రావట్లేదని సమాచారం. వాచ్ మెన్ విధులు సరిగా లేకపోవడం వల్లే గతంలో ఈఆర్ఓ కార్యాల యంలో ఉన్న దస్త్రాలు అగ్గిపాలు అయ్యాయనే విషయం విదితమే. మళ్ళీ ఇలాంటి సంఘ టనలు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతోనే పెర్కిట్ సబ్ డివిజన్ ను, ఈఆర్ఓ కార్యాల యంను కలుపుకొని ముగ్గురు నైట్ వాచ్ మెన్ లను నియమించారు. ఇందులోని వారు విధులకు రాని సమయంలో సంఘటన జరిగినట్లయితే బాధ్యులెవరనే సందేహాలు సిబ్బందిలో మెదులుతున్నాయి.

2 లో



2 లో

## భద్రాచలం ఎమ్మెల్యే పిఏ అరెస్ట్

భద్రాచలం, బతుకమ్మ : భద్రాచలం ఎమ్మెల్యే పీఏ ఉద్యోగాల పేరుతో 8 కోట్లు వసూళ్ళు చేసి ఆ డబ్బులు ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ లో పెట్టి . . చివరికి జైలుకు పోయాడు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో భారీగా డబ్బులు పోగొట్టుకుని వాటిని తీర్చుకునేందుకు ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడిన రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ భద్రాచలం ఎమ్మెల్యే పీఏ కోర్ల కళ్యాణ్ అరెస్ట్ అయ్యాడు.



2 లో

### ఎస్ఐఆర్ నోటీసుల జారీ విచారణ ప్రక్రియను

## పారదర్శకంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, పక్కాగా మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు.

### స్పీకర్‌పై అవమానకరంగా మాట్లాడిన

## ఎమ్మెల్సీ తీరును ఖండించిన సీఎం

ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి



2 లో

హైదరాబాద్, బతుకమ్మ : శాసనసభ స్పీకర్ పై అత్యంత హేయంగా, అవమానకరంగా, కించపరుస్తూ శాసనమండలి సభ్యుడు మాట్లాడిన తీరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాసనసభ చరిత్రలో ఇదొక చీకటి రోజుగా అభివర్ణించారు. ఈ విషయంలో ప్రతిపక్ష నాయకుడు కే చంద్రశేఖర్ రావు సభకు క్షమాపణలు చెప్పాలని కోరారు. శాసనసభ ప్రాంగణ పరిధిలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడిన విషయాన్ని అసెంబ్లీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లేవనెత్తిన అంశంపై ముఖ్యమంత్రి స్పందించారు. స్పీకర్ పై దుర్భాషలాడిన సభ్యుడిని అనర్హుడిగా ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. “ఇది అత్యంత తీవ్రమైన నేరమని, సభా ప్రాంగణంలో సభాపతి పై అంత అభ్యంతరకరమైన భాష అని, సభాపతి ని, ఆయన కుటుంబ సభ్యులను అవమానిస్తూ మాట్లాడడం ఇది కేవలం దళితులకు జరిగిన అవమానం కాదని, ఇది అందరికీ జరిగిన అవమానం” అని ముఖ్యమంత్రి సభ దృష్టికి తీసుకువచ్చారు.




2 లో

## మాలబార్‌లో జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ ప్రారంభం

ఇందూర్, బతుకమ్మ : మాలబార్ గోల్డ్, డైమండ్స్ ల సహజరత్నాల ఆభరణాలకు సరికొత్త రూపాన్ని అందస్తూ నైరా కలెక్షన్ ను వినియోగదారులు సోమవారం ఆవిష్కరించారు. నిజామాబాద్ లో నిర్వహిస్తున్న ఈ బ్రాండ్ జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ కి నైరా కలెక్షన్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందన్నారు.ఈ ఉత్సవాల్లో భాగంగా వినియోగదారులు రత్నాలు, అన్ కట్ ఆభరణాల తరుగుచార్జీలపై 25 శాతం వరకు తగ్గింపును పొందవచ్చని, ఈ ఆఫర్ ఈనెల 14 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

# మాలబార్ లో జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ ప్రారంభం

ఈ అద్భుతమైన పనితనం, రత్నాల ప్రత్యేకత, విలక్షణమైన సౌందర్యాన్ని ప్రధానంగా , సాంప్రదాయ ఆభరణాల తయారీ నైపుణ్యాన్ని, అభివృద్ధి చెందుతున్న డిజైన్ అభిరుచులను, వినియోగదారుల ప్రాధాన్యతలను మేళవించడంపై మలబార్ గోల్డ్ డైమండ్స్ దృష్టిని సారిస్తుంది అని, నైరా కలెక్షన్ ఆవిష్కరణతో పాటుగా జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ ప్రారంభంపై, సహజ స్వభావాన్ని కాపాడేలా ఈ కళాత్మకత కలెక్షన్ ను తీర్చిదిద్దామన్నారు. ఆభరణాల నాణ్యత, పారదర్శకత, నమ్మకమైన కొనుగోలు ప్రమాణాలకు భరోసానిచ్చే ఆభరణాలను వినియోగదారులకు అందిస్తున్నమని మరింత చేరువ కావాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టోర్ హెడ్ అక్షయ్, షోరూం మేనేజర్ ప్రశాంత్, మార్కెటింగ్ మేనేజర్ ఈమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# జైలులో సేవలు కావాలా లంచం ఇవ్వాల్సిందే..!

వెబ్ డెస్క్, బతుకమ్మ :జైలు లో ఉన్న రిమాండ్ ఖైదీ కి సేవలు కావాలా, అపరిమిత ములాఖత్ (విజిట్ ) లు కావాలా అయితే జైలు అధికారులకు లంచం ఇవ్వాల్సిందే. ఇప్పుడు జైళ్ల శాఖలో ఇదే ట్రెండ్. అదే సంప్రదాయం పాటిస్తూ జైలర్ ఒకరు రిమాండ్ ఖైదీ మామ నుంచి జైలు శాఖ నిర్వహిస్తున్న బంక్ ఆపరేటర్ ద్వారా రూ. 10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ కి దొరికారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సబ్ జైలు జైలర్ నాంపల్లి దేవేందర్, పెట్రోల్ బంక్ ఆపరేటర్ రావుల హరీష్ లు ఒక వ్యక్తి నుంచి రూ. 10 వెల లంచం తీసుకుంటూడగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నా రు.ఖమ్మం జైలు నుంచి హుజురాబాద్ కు ఒక రిమాండ్ ఖైదీ బదిలీ పై వచ్చారు. అయితే రిమాండ్ ఖైదీ కి జైలు లో సేవలు, మూలాఖత్ కోసం జైలర్ నాంపల్లి దేవేందర్ లంచం డిమాండ్ చేసారు. రిమాండ్ ఖైదీ మామ ఏసీబీ ని ఆశ్రయించారు. సోమవారం జైలర్, ఆపరేటర్ ద్వారా లంచం తీసుకుంటుండగా పట్టుకొని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్ట్ లో హాజరుపరిచారు.

# ఎస్ఐఆర్ నోటీసుల జారీ

## విచారణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, పక్కాగా మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, వాటి పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు తగిన సమయం కల్పించి, వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మల్ కలెక్టరేట్ నుండి వీ.సీలో పాల్గొన్న జిల్లా పాలనాధికారి భవేష్ మిశ్రా మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిలో ఉందని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి తెచ్చారు. నిర్ణీత గడువులోగా విచారణను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నా మని వివరించారు. నిజామాబాద్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

# యోగాలో విద్యార్థి ఆదిత్యకు సిల్వర్ మెడల్



ఇందూర్, బతుకమ్మ : యోగా అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్ జిల్లా వారి ఆధ్వర్యంలో నందిపేట్ లోని ఉజ్వల స్కూల్లో ఈనెల 1న నిజామాబాద్ జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కాకతీయ ఒలంపిక్స్ సుభాష్ నగర్ 7వ తరగతి విద్యార్థి పడకంటి ఆదిత్య 10-12 వయసు కేటగిరి లో ఎలాంటి లాంగ్ టర్మ్ కోచింగ్ లేకున్నా ఆరోగ్యరక్ష యోగా సెంటర్ డా.ఐశ్వర్య ఆధ్వర్యంలో కేవలం రెండు గంటల్లో ప్రాక్టీస్ చేసి మొదటి సారి యోగా పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించటం పట్ల కాకతీయ స్కూల్ యాజమాన్యం, ఆరోగ్యరక్ష ఐశ్వర్య, ఆదిత్య తల్లితండ్రులు డా. రాము సాత్విక సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీ, ప్రధానోపాధ్యా యుడు చంద్రశేఖర్, ఉప ప్రధానోపాధ్యాయురాలు భావన ఠాకూర్, యోగా కోచ్ గంగాధర్ లు అభినం దించారు. రాష్ట్రస్థాయిలో కూడా మంచి ప్రతిభను కనబరిచి పథకాలు సాధించాలని కొనియాడారు.

# ఉపాధ్యాయ సన్మాన సభలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఆక్షేపణీయం

### -టియస్‌యూటీఎఫ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ మల్క జనార్దన్

భీమ్ గల్, బతుకమ్మ :సెప్టెంబర్ 5 న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తన స్వంత నియోజకవర్గం కొడంగల్ లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయులనుద్దేశించి ముఖ్యమంత్రి చేసిన ప్రసంగాన్ని టియస్‌యుటిఎఫ్ తీవ్రంగా నిరసిస్తుందని, సీ. ఎం వ్యాఖ్యలు అక్షేపనీయమని టిఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ అన్నారు. ఉపాధ్యాయుల పండుగ రోజు వరాలు కురిపించి మురిపిస్తారని ఆశించిన ఉపాధ్యాయులకు ఆశాభంగం కలిగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, ఐదు డిఏలు ప్రకటించి ఉద్యోగుల, ఉపాధ్యాయుల మన్ననలు పొందాల్సిన సమయంలో, ఒకవైపు ఉద్యోగులు తీవ్రస్థాయిలో పోరాటం చేస్తుంటే ఆ పోరాటాలను చులకనగా భావిస్తూ ఇంకా రెండేళ్ళు ఓపికపట్టమనడం చాలా విచిత్రంగా ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు. మూడేళ్ళ ఆలస్యానికి కారణాలు చెప్పకుండా దాటవేసే ధోరణిని అవలంబించారని ఆయన ఆక్షేపించారు. మరోవైపు పోరాటాలు చేసేవారిని చర్చలకు పిలవకుండా, పోరాటంతో సంబంధం లేని వ్యక్తులను ఉటంకిస్తూ మాట్లాడటం ద్వారా తన రాజనీతిజ్ఞత ప్రదర్శించారని ఆయన దుయ్యబట్టారు. ఇప్పుడు బలంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జెఏసిని బలహీనపరచే ఎత్తుగడలో మాట్లాడారని కానీ కిందిస్థాయి ఉద్యోగులు ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని, పైగా వారిలో మరింత పోరాట కసి పెరిగిందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి మాటల వల్ల తమ ప్రభుత్వమే అప్రతిష్ట పాలవుతున్న విషయాన్ని గమనించాలని, ఏది ఏమైనా ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా పిఆర్‌సి, డిఏ ఇవ్వకుండా పోరాటం విరమించేది లేదని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. నాయకులుగా పోరాటాలు నిలిపివేయాలని నిర్ణయించినా సరే కింది స్థాయి క్యాడర్ మాత్రం నాయకత్వాలను తిరస్కరించి పోరాటాలకు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులు వస్తే టియస్‌యూటీఎఫ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పక్షాన పోరాటం చేపడుతుందని వారికి భరోసానిస్తున్నామని ఆయన చెప్పారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోకుండా ఉద్యోగుల డిమాండ్లను నేరవేర్చి ఆందోళనను విరమించేలాచేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు

## దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను

# ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

### ఉద్యోగులంతా ఐక్యంగా 10న చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలి

### టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో నిర్వహించబోయే చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయుట కొరకు టీజీఈజేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని టీఎన్జీవో భవన్ లోని స్వామినాథం సమావేశ మందిరంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సన్నాక సమావేశానికి టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నా రు. తమ ప్రధానమైన డిమాండ్లపై ఏకవాక్య తీర్మానం చేసి పరిష్కరించాలని లేని యెడల తదుపరి ఉద్యమ కార్యచరణను ప్రకటిస్తామ ని తెలిపారు. 2వ వేతన సవరణ సంఘం అమలు చేయాలని, 2వ వేతన సవరణ సంఘం నివేదికను వెంటనే తెప్పించి 1.7.2023 నుంచి 51 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యం డీఏలు ఎటువంటి ఆలస్యం లేకుండా విడుదల చేయాలని కోరారు.ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ప్రతి నెల కనీసం రూ.2 వేల కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ను పునరుద్ధరించాలని, ఉద్యోగుల భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఉద్యోగ సంఘాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ ఉద్యోగ సంఘాల గుర్తింపును పునరుద్ధరించి ప్రజాస్వామ్యబద్ధమైన చర్చలకు అవకాశం కల్పించాలని కోరారు. ఉద్యోగులంతా ఐక్యంగా చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని కోరారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహా ధర్నా కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయు లు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి టీజీఈజేఏసీ రాష్ట్ర నాయకులు దామోదర్ రెడ్డి, నరసింహారెడ్డి,స్వామి, జిల్లా కన్వీనర్ అలుక కిషన్, కో కన్వీనర్ శంకర్, రమన్ రెడ్డి, కో చైర్మన్లు రమేష్, అమృత్ కుమార్ ,కృష్ణారెడ్డి,ప్రవీణ్ కుమార్, ధర్మేందర్, సురేష్, శ్రీనివాస్, నరసయ్య, నేతికుంట శేఖర్, అన్ని భాగస్వామ్య సంఘాల నాయకులు, టీఎన్జీవో రాష్ట్ర నాయకులు, అన్ని యూనిట్ శాఖల అధ్యక్ష కార్యదర్శులు ఉద్యోగులు, మహిళా ఉద్యోగ సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

## స్పీకర్‌పై అవమానకరంగా మాట్లాడిన

# ఎమ్మెల్సీ తీరును ఖండించిన సీఎం

### ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి

స్పీకర్ పై చేసిన వ్యాఖ్యలు తెలంగాణకు ఇది ఒక చీకటి రోజు అని, 4 కోట్ల ప్రజలకు జరిగిన అవమానం" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అడ్డగోలుగా ఏం మాట్లాడినా చెల్లుతుందని అనుకునే వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని, గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ అంశం ఒక శాసనసభ్యుడికి సంబంధించిన సమస్య కాదని, రాజకీయాలకు అతీతంగా సభలోని ప్రతి సభ్యుడు స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. "స్పీకర్ తల్లిని అవమానించేలా మాట్లాడటం అందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నామని, మనందరం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందని, రాజకీయాలకు అతీతంగా మనం వ్యవహరించాలని, ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలన్నారు. దుర్మార్గమైన భాష మాట్లాడిన ఎమ్మెల్సీని అనర్హుడిగా ప్రకటించి సమాజానికి మంచి సందేశం పంపించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు.

# భద్రాచలం ఎమ్మెల్యే పిఏ అరెస్ట్

మణుగూరు బీటీపీఎస్ సారపాక ఐటీసీ కంపెనీలలో ఉద్యోగాల పేరుతో 54 మంది నుంచి రూ. 8 కోట్లు వసూలు చేసిన నిందితుడు కోర్ల కళ్యాణ్ భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, ఇల్లందు,చర్ల తదితర ప్రాంతాల్లో నిరుద్యోగును మోసం చేశాడు. బాధితుడు రాయల శ్రీను ఫిర్యాదుతో భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. నిందితుడిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఇప్పటికే పలు కేసులు నమోదు అయ్యాయి. ఉద్యోగాల పేరుతో మోసం చేసే కేటుగాళ్ల పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, అక్రమ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని పోలీసుల విజ్ఞప్తి చేస్తున్నారు. ఎవరికైనా ఇలాంటి మోసాలు లేదా అనుమానాస్పద లింకుల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

# ఆర్మూర్ ఏడిఎం విభాగం అస్తవ్యస్తం...?

ఈఆర్ఓ నుంచి ఏడిఎంలోకి

ఎస్ఏ, వాచ్ మెన్

ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే వలస ..!

కంప్యూటర్ సీట్లో నైట్ వాచ్ మెన్

రాత్రి కాపలా హుళక్కే..!

గతంలో ఈఆర్ఓ అగ్గిపాలు

.డివిజన్ కార్యాలయంలో విధుల నిర్వహణలో సిబ్బంది ఇష్టారాజ్యంపై అధికారుల మౌనం వెనుక మర్మమేమిటో తెలియరావట్లేదనే చర్చ ఉద్యోగుల నుంచి వినబడుతోంది. పై స్థాయి అదికారుల అండదండలు ఉండడం వల్ల విధులకు రాకపోయిన పూర్తి వేతనం కట్టిస్తున్నారనే ఆరోపణలు డివిజన్ కాంపౌండ్ లో వినిపిస్తున్నాయి. విధులకు వచ్చిననాడే రాని రోజులకు గాను హాజరు వేసుకున్నగాని, అడ్డు చెప్పే నాథుడే లేకపోవడంతో అతను ఆడిందే ఆటగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. పాలన విభాగంలో జరుగుతున్న వ్యవహారాలపై విచారణ జరిపి, చక్కదిద్దాలనే అభిప్రాయాలను డివిజన్ ఉద్యోగులు వెలిబుచ్చుతున్నారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతల విమర్శలా?

## మూడో వార్డులో అభివృద్ధి పనులపై రాజకీయ దుమారం



బిచ్కుంద, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. మూడో వార్డు కౌన్సిలర్ ధర్పల్ కార్తీక్ సంతోష్ ఆధ్వర్యంలో వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్ చొరవ తీసుకుంటున్నారని చెబుతున్నారు. అభివృద్ధి పనులకు ప్రజల నుంచి స్పందన వస్తుండటంతో కొందరు రాజకీయంగా విమర్శలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మూడో వార్డులో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు విమర్శలకు దిగుతున్నారని కౌన్సిలర్ వర్గీయులు మండిపడుతున్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులను స్వాగతించాల్సింది పోయి రాజకీయ విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.విమర్శలకు మాటలతో కాకుండా అభివృద్ధి పనులతోనే సమాధానం ఇస్తామని ధర్పల్ కార్తీక్ సంతోష్ వర్గీయులు స్పష్టం చేస్తున్నారు. మూడో వార్డును మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా సహకరించాలని, ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన పనులను అడ్డుకోవడం కాకుండా అందరూ కలిసి వార్డు అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# సిజిఆర్ఎఫ్-2 చైర్మన్ గా కె. కిషన్



ఇందూర్, బతుకమ్మ: విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నూతన చైర్మన్ గా కె. కిషన్ నిజామాబాద్ లో పదవి బాధ్యతలు చేపట్టారు. ఈయన రెండేళ్ల క్రితం సిఈ గా చేసి ఉద్యోగ విరమణ పొందారు. దీనికి చైర్మన్ గా ఉన్న ఎరుకల నారాయణ పదవి కాలం ఏప్రిల్ లో ముగియడంతో, సిఈ రామకృష్ణ కు ఇంచార్జి ఇచ్చారు. ఈయన మే నెలలో ఉద్యోగ విరమణ పొందడంతో ఆదిలాబాద్ సిఈ చౌహాన్ కు బాధ్యతలు అప్పగించారు. ఈ పదవి కోసం ఇక్కడే విరమణ చేసిన రామకృష్ణ సైతం ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. చివరకు రెండు సంవత్సరాల క్రితం సిఈ గా ఉద్యోగ విరమణ చేసిన కిసాన్ కు మూడేళ్ళ పాటు చైర్మన్ గా నియమిస్తూ కంపెనీ సిఎండి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసారు. జిల్లా కేంద్రంలో ఉన్న సిజిఆర్ఎఫ్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. అకౌంటెంట్ శ్రీనివాస్, ఏడిఈ రాజేశ్వర్, ఏఈ, సిబ్బంది నూతన చైర్మన్ కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, జగిత్యాల్, అదిలాబాద్, మంచిర్యాల్ జిల్లాలకు కలిపి సమస్యల పరిష్కార వేదిక -2 ఈ చైర్మన్ పరిధిలోకి వస్తాయి.

# నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యత

## పోలీసు కమిషనర్ సాయిచైతన్య





నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని పోలీసు కమిషనర్ సాయిచైతన్య అన్నారు. పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీ-రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని సోమవారం గిరిరాజు ప్రభుత్వ కాలేజీ ఆడిటోరియంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్, సబ్-ఇన్‌స్పెక్టర్ తదితర ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరు ద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ,సరైన మార్గద ర్శకత్వం అందించడంతో పాటు పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా వారిని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.అభ్యర్థులు ఈ 60 రోజుల శిక్షణను ఎంతో విలువైన అవకాశంగా భావించి, ప్రతిరోజూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై అధ్యాపకులు సూచించే విధంగా కష్టపడి చదివి నిరంతరం సాధన చేయాలని కమిషనర్ సూచించారు. కేవలం శిక్షణకు హాజరవడం మాత్రమే కాకుండా ప్రతిరోజూ నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూతమ బలహీనతలను గుర్తించి వాటిని అధిగమించేలా కృషి చేయాలని అన్నారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగితే విజయం తప్పకుండా సాధించవచ్చని అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ భరోసా కల్పించారు. ఈ ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమం 60 రోజుల పాటు కొనసాగుతుందని, హైదరాబాద్‌కు చెందిన భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, నిపుణులచే అభ్యర్థులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించబడతాయని,ఈ శిక్షణ కార్యక్రమం నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాల ఆడిటోరియంలో కొనసాగుతుందన్నారు. శిక్షణలో భాగంగా పోలీస్ రిక్రూట్‌మెంట్ పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ అంశాలపై అభ్యర్థులకు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. పరీక్షలో ప్రశ్నలను వేగంగా, కచ్చితంగా పరిష్కరించే విధానం, సమయపాలన, పరీక్షా విధానం, ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టడం వంటి అంశాల్లో నిపుణులచే మార్గదర్శకత్వం అందించనున్నారు. అలాగే అభ్యర్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా శిక్షణ అందించడంతో పాటు, నిరంతర సాధన ద్వారా పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహించనున్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్య కిరణ్, నిజామాబాద్,ఆర్మూర్, బోధన్,సి.టి.సి ఎ. సి.పి లు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, నిజామాబాద్ టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్, నిజామాబాద్ రూరల్ సిఐలు సతీష్ కుమార్, శ్రీనివాస్,మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీలత, సిసిఆర్బి ఎస్ఐ వరప్రసాద్ రెడ్డి, ఎస్సైలు హరిబాబు, సందీప్,?సునీల్, సీసిఆర్బి ఎస్ఐ వెంకట్రావు, ఫాకల్టీ, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందూర్ మదర్ హుడ్ హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

## ప్రజావాణిలో ఆర్ఎస్‌పీ జిల్లా కమిటీ ఫిర్యాదు




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఇందూర్ మదర్ హుడ్ హాస్పిటల్ యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్ పీ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి కటారి రాములు మాట్లాడుతూ ఒక గర్భిణీ మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన సమయంలో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్, ఇందూర్ మదర్ హుడ్ హాస్పిటల్ యాజమాన్యంతో కుమ్మక్కై ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ లేరని తప్పుడు సమాచారం ఇచ్చి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారని ఆరోపించారు. కేవలం రూ.25 వేలలోనే ప్రసవం పూర్తి చేస్తామని చెప్పి చివరకు రూ.85 వేల వరకు బిల్లు వసూలు చేశారని తెలిపారు. ఈ విషయమై బాధిత కుటుంబం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అనంతరం?హాస్పిటల్ యాజమాన్యం తరఫున ముగ్గురు వ్యక్తులు బాధిత మహిళ ఇంటికి వెళ్లి తెల్ల కాగితంపై సంతకం చేయాలని ఒత్తిడి తీసుకువచ్చి, బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. బాధితులను భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత దారుణమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన హాస్పిటల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకునిబాధిత మహిళకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధిత కుటుంబంతో కలిసి హాస్పిటల్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంపై డీఎంహెచ్ఓ కార్యాలయానికి ఫిర్యాదు చేసి వారం రోజులు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని, సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నిజాముద్దీన్, సునీల్, రంజిత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ ఆధ్వర్యంలో

# బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో 12వ డివిజన్ ధర్మపురి హిల్స్ యువ నాయకుడు ఎస్.కె.అమీర్ జలాల్ తన మద్దతుదారులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల మాట్లాడుతూ సాధారణంగా ఏదైనా లాభం పొందాలనుకునే వారు అధికార పార్టీలో చేరుతారని?కానీ ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతుండటం ప్రజల్లో వస్తున్న మార్పుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను,?ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో మళ్లీ ఆదరణ పెరుగుతోందని రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మళ్లీ సీఎం కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బిగాల అన్నారు. ప్రతి డివిజన్‌లో బీఆర్ఎస్‌లో జరుగుతున్న భారీ చేరికలు దీనికి నిదర్శనమని , రానున్న రోజుల్లో ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీకి మరింత ఆదరణ పెరిగి, తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కడతారని గణేష్ బిగాల ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నవీద్ ఇక్బాల్, సమీ, సనా ఉల్లా,?సిర్ప రాజు, సుజిత్ సింగ్, ప్రభాకర్ రెడ్డి, దండు శేఖర్, జగత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 116 ఫిర్యాదులు

## ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కలెక్టర్ భుజంగరావు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 116 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పోలీసు ప్రజావాణికి 37 ఫిర్యాదులు

## స్వీకరించిన పోలీస్ కమిషనర్ సాయిచైతన్య




నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 37 ఫిర్యాదులు అందాయి. వీటిని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల ఎస్.ఐలు, సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజలు వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని సీపీ పేర్కొన్నారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలిపారు.

## ప్రజావాణికి 12 పిటిషన్లు



భీమ్ గల్, బతుకమ్మ :ప్రతి సోమవారం మండల పరిషత్ ఆఫీస్ లో నిర్వహించే ప్రజావాణికి 12 పిటిషన్లు వచ్చినట్లు ఎంపీడీఓ సంతోష్ కుమార్ తెలిపారు. ఆ పిటిషన్లలో రెవిన్యూ డిపార్ట్మెంట్ కు సంబంధించి 3,ఎంపిడీఓ 1, ఎంపీఓ 2, హౌసింగ్ 5, డిప్యూటీ ఈ. ఈ, ఏ, ఈ పంచాయత్ రాజ్ డిపార్ట్మెంట్ కు 1 వచ్చినట్లు ఎంపిడీఓ వివరించారు.

## ఏర్గట్ల బిజెపి మండల అధ్యక్షుడు, బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, అరెస్ట్



ఏర్గట్ల,బతుకమ్మ, హైదరాబాదులో15.000/కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి పార్టీ చేపట్టిన ,,చలో అసెంబ్లీ,,ముట్టడి కార్యక్రమానికి ఏర్గట్ల మండల కేంద్రం నుండి బిజెపి పార్టీ నాయకులు హైదరాబాద్ బయలుదేరుతారనే సమాచారంతో ముందస్తుగా ఏర్గట్ల మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు నాయకుడు గంగాధర్,జిల్లా బిజెపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏలేటి నారాయణరెడ్డిని ఏర్గట్ల పోలీస్ లు అరెస్టు చేశారని ఏర్గట్ల మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు నాయకుడు గంగాధర్ తెలిపారు.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ ...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల కేంద్రంలోని జేయన్సీ కాలనీ హరిజనవాడలో గల ప్రైమరీ పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు సోమవారం గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ చేతుల మీదుగా దుస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉప సర్పంచ్ నిస్సార్, ఉపాధ్యాయురాలు సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజవాణిలో కాంగ్రెస్ పార్టీ మోసంపై బీయర్ఎస్ నాయకుల ఫిర్యాదు



భీమ్ గల్, బతుకమ్మ :మండల పరిషత్ ఆఫీస్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు బుటకపు హామీలను ఇచ్చి మోసం చేసిందని మండల బీయర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వారు పిటిషన్ ఇచ్చారు. గత ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టాలని హామీల నిచ్చి వాటిని 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చ లేదని పేర్కొన్నారు. 100 రోజుల్లో తీరుస్తామని చెప్పి 1000 రోజులు గడిచిన ఇప్పటికి ఒక్క హామీని పూర్తి స్థాయిలో నెరవేర్చలేదని వివరించారు.

# హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది

### నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల...

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల విమర్శించారు. నిజామాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బడ్జెట్, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా 6 గ్యారెంటీలు,420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. రూ. 2,000 పెన్షన్‌ను రూ. 4,000 చేస్తామని, ఇంట్లో ఇద్దరికి ఇస్తామని ఆశ చూపి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. గత 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా ఎదిగిందని కొనియాడారు. రైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ వంటి పథకాలతో రైతులను,పేద ప్రజలను ఆదుకున్న ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ దేశానికే ధాన్యాగారంగా మారిందన్నారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ విఫల పాలనపై శాంతియుతంగా అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 420 హామీల ఫ్లెక్సీల ప్రదర్శన, ధర్నాలు, బైక్ ర్యాలీలు, నిరసనలు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం అడ్డుకోవడం అప్రజాస్వామికమని అన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జగదీష్ రెడ్డి,మాజీ మంత్రి ఎమ్మెల్యే సుజాత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు, ప్రభుత్వం ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ వైఫల్యాలను గమనిస్తున్న ప్రజలు ఇతర పార్టీల నాయకులు బిఆర్ఎస్ వైపు వస్తున్నారని, ప్రతినిత్యం భారీగా చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో



బిఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలు కూడా స్పష్టం చేస్తున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, సిర్ప రాజు, మాజీ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, అబ్దుల్ మతీన్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ ఆధ్వర్యంలో ధర్నా

### ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తించిన తీరు, పోలీసుల ద్వారా చేయించిన భౌతిక దాడులను నిరసిస్తూ నిజామాబాద్ నూతన కలెక్టరేట్ వద్ద నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులను కలసి ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిగాల మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీల అమలును కోరుతూ నల్ల టీషర్టులు ధరించి శాంతియుతంగా అసెంబ్లీకి వెళ్తున్న బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. నర్సాపూర్ మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర



పట్టుకుని లాగడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి, మహిళల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు , జగదీష్ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలను కిందపడేసి, తొక్కి, తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధిపై జరిగిన దాడికి, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిపిన భౌతిక దాడులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే బహిరంగ



క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పాలన చేతకాకపోతే రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేసి గద్దె దిగాలని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, నిరంకుశ పాలన సాగిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బిఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

## కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికై

# ఛలో హైదరాబాద్ కరపత్రాల ఆవిష్కరణ

ఇందూర్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్రంలోని కేజీబీవీ లో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్ల వేతనాల పెంపు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 11 ఛలో హైదరాబాద్ ప్రచార కరపత్రాలను నిజామాబాద్ సౌత్, నార్త్ కేజీబీవీల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లకు ఏళ్లుగా వేతనాలు పెరగలేదని, పైగా పని భారం పెరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించమని విన్నవిస్తే, అదనంగా నైట్ డ్యూటీలు వేశారని ఆరోపించారు. కేజీబీవీ ల పట్ల జత ప్రభుత్వం కంటే కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా అధికారులను ప్రభుత్వాన్ని ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తూనే ఉన్నామని, ఇక పోరాటం తప్ప మరోమార్గం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలన్నారు. అకౌంటెంట్, వర్కర్లకు నిబంధనలకు, జాబ్ చార్ట్ కు భిన్నంగా ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. వారానికి ఒకరోజు సెలవు చొప్పున వర్కర్లకు వీక్లీఆఫ్ అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులు భర్తీచేసి పనిభారం తగ్గించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హతలు ఉన్న నాన్ టీచింగ్ సిబ్బందికి వెయిటేజీ ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ వయసును 65 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ, ఆరోగ్యభద్రత కల్పించాలన్నారు. ఈనెల 11న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేజీబీవీల నాన్ టీచింగ్, వర్కర్లు పెద్ద సంఖ్యలో



హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది అఖిల, నగ్మా, రజిని, బాలమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## “ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షిద్దాం.... విద్యార్థుల భవిష్యత్తును కాపాడుదాం”

### పిఆర్ టియు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రస్తుతం అమల్లో ఉన్న జీవో నెంబర్ 25 నిబంధనల వల్ల క్షేత్రస్థాయిలో బోధన సిబ్బంది కేటాయింపుల్లో తీవ్ర లోపాలు ఏర్పడి, పాఠశాలల నిర్వహణ, విద్యా ప్రమాణాలు దెబ్బ తింటున్నందున జీవోను సవరించాలని పిఆర్ టియు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల పరిరక్షణ, అభివృద్ధి, విద్యార్థులలో విద్యా ప్రమాణాల పెంపుదల సాధించాలంటే ప్రాథమికోన్నత పాఠశాలల బలోపేతం అత్యంత కీలకమని, కావున విద్యార్థుల సంఖ్య తో పాటు తరగతుల సంఖ్యను కూడా ప్రాతిపదికంగా తీసుకొని ఉపాధ్యాయుల కేటాయింపులు జరగాలన్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు తరగతికి ఒక ఎస్జీటీ ను కేటాయిస్తూ, అలాగే ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలలో కనీసం ఒక స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

# గణేష్ మండలి నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాలి

## పోలీస్ కమిషనర్ సాయిచైతన్య



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : గణేష్ మండలి నిర్వాహకులు పోలీసు శాఖ సూచించిన నిబంధనలు తప్పకుండా పాటించాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.గణేష్ విగ్రహ ఏర్పాటు కోసం ప్రజల నుండి డబ్బులను బలవంతంగా వసూలు చేయరాదని,గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, స్థలం కోసం సంబంధిత శాఖల వారికి సమాచారం ఇవ్వాలన్నారు. గణేష్ మండళ్ల వద్ద సందర్శించే మహిళలపై, యువతులపై ఈవ్ టీజింగ్" జరుగకుండా చూడాలని, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా డి.జె / డి.జె మిక్సర్స్ / హైఫిడిలిటి ( హైఫై ) సౌండ్సిస్టమ్ ఇక్విప్మెంటు విషయంలో చాలా జాగ్రతలు వహించాలని సీపీ సూచించారు. రాత్రి 10 గంటలకు " లౌడ్ స్పీకర్లు" ఆఫ్ చేయాలని,ఈ విషయంలో సుప్రీంకోర్టు నిబంధనలను పాటించాలని,లేని యెడల చట్టరీత్యా చర్యలు తీసుకొనబడునన్నారు.డి.జే లు పూర్తిగా నిషేదం తీసుకోవాలని, మైక్ పర్మిషన్ కోసం సంబంధిత ఎ.సి.పి ని సంప్రదించి తప్పని సరిగా పర్మిషన్ తీసుకోవాలన్నారు.విధ్యుత్ సరఫరా ఆగకుండా వీధి దీపాలు వెలిగేటట్లు చూడవలెనని, షార్టు సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరు ను ఉపయోగించాలి. ప్రతీ చోట ఎమ్.సి.బి ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలుగజేసే ఎటువంటి చిన్న సమాచారాన్ని అయిన మీ దగరలోని పోలీసులకు, లేదా డయల్ 100 కు ఫోన్ చేయగలరు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 87126- 59700 కు తెలపాల న్నారు. గణేష్ మండలి వద్ద ఉదయం, రాత్రి వేళలో ఇద్దరూ లేదా ముగ్గురికి తక్కువ కాకుండా తమ కమీటీ మెంబర్ల ను మండలి వద్ద ఉంచవలెనని, పోలీస్ వారు చెకింగ్ కు వచ్చినప్పుడు ప్రతీసారి ఉండాలని, మండపం దగ్గర అసాంఘిక చర్యలు లేకుండా చూసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తుల గూర్చి సమాచారం తెలియజేయాలని, మీ దగ్గరలో ఎవ్వరయిన అనుమానస్పదంగా బ్యాగులు??ప్లాస్టిక్ సంచూలు వదిలినట్లయితే వాటిని తాకరాదని అట్టి సమాచారం దగరలోని పోలీస్ అధికారులకు తెలుపాలన్నారు. గణేష్ మండళ్ల వద్ద ఏప్పుడైన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గరలో రెండు బకెట్ల నీళ్లు,రెండు బకెట్ల ఇసుక ఏర్పాటు చేసుకోవాలని, మరియు ఫైర్ బాల్స్ సమకూర్చుకోవాలన్నారు. యువకులు కోపతాపాలకు వెళ్లకుండా " సంయమనం" పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎటువంటి " రూమర్స్ (పుకార్ల) ను నమ్మరాదన్నారు.ప్రజలకు అసౌకర్యం కలుగకుండా నిరంతర పోలీస్ నిఘా ఏర్పాటు చేయబడిందని, సంబంధిత నిర్వాహకులు అవసరం నిమిత్తం ఉపయోగించుట కొరకు మీ దగ్గరలోని పోలీస్ సిబ్బంది ఫోన్ నెంబర్లను రాసి పెట్టుకోవాలన్నారు.

గణేష్ భక్తులు,నిర్వాహకులు మద్యపానానికి దూరంగా ఉండాలని, గణేష్ మండళ్ల వద్ద" పేకాట ఆడరాదని, గణేష్ ఉత్సవాలలో" టపాసుల" నిషేదం ఉందన్నారు. నిమజ్జనం రోజు పోలీసు వారు జారీ చేసిన నియమ నిబంధనలు పాటిస్తూ విగ్రహాన్ని (రథాన్ని) "క్యూ" లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతీ రథనికి లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు.వినాయక విగ్రహం తీసుకొని వచ్చే రోడ్డులో కానీ వినాయక విగ్రహం తీసుకొని వెళ్లే రూటులో కానీ ఎంత ఎత్తు గలదో అట్టి దారి పొడవున ముందుగానే చూసుకోవాలని,ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందుగానే అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని, ప్రజలు పోలీసులకు ఎల్లప్పుడు సహకరించాలని అన్నారు.

# కేంద్ర కనీస వేతనాల సలహా బోర్డులో సిఐటియు సంఘాన్ని చేర్చాలని దిష్టిబొమ్మ దగ్ధం




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కనీస వేతనాల సలహా బోర్డులో కేంద్ర కార్మిక సంఘాలను సభ్యులుగా చేర్చకుండా నియమించటాన్ని నిరసిస్తూ సిఐటి యు రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని నాందేవ్ వాడలో నిరసన ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులకు ప్రజలకు నష్టం కలిగించే పద్ధతుల్లో కార్పొరేంట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఉపయోగపడటానికి నిత్యం కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తున్న సిఐటియు, ఏఐటీయూసీ మరియు ఐఎన్టియుసి సంఘాలను ప్రాతినిధ్యం కల్పించకుండా చేయటన్ని కార్మిక వర్గం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒకవైపు కార్మిక చట్టాలను మార్చుడంతో పాటు కార్మిక సంక్షేమాల కోసం పనిచేస్తున్న సంఘాలను నిర్లక్ష్యం చేయటం ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తుందని, ఇది ఎట్టి పరిస్థితుల్లో సరైన విధానం కాదని ప్రభుత్వం తన ఆలోచనను, విధానాన్ని మార్చుకొని కేంద్ర కార్మిక సంఘాలను కనీస వేతనాల సలహా బోర్డులో సభ్యత్వాలను ఇవ్వాలని ,లేనియెడల బిజెపీ నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక్స్ సంఘాలు ఐక్య పోరాటాలకు సిద్ధపడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శిలు స్వర్ణ, నరేష్, జిల్లా కమిటీ సభ్యులు గంగాధర్, నాయకులు సందీప, సరిత, మురళి, వేణు, సాయిలు, తదితరులతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

# ఏర్గట్ల స్కూల్ జూనియర్ అసిస్టెంట్ బదిలీ ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం




బతుకమ్మ,ఏర్గట్ల:ఏర్గట్ల ఉన్నత పాఠశాల నుండి జెడ్పిహెచ్ఎస్, ఎస్సారెస్పీ, ( పోచంపాడు ) కి బదిలీపై వెళ్తున్న జూనియర్ అసిస్టెంట్ కోమలి కి ఏర్గట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమరగిరి కృష్ణ చారి వీడ్కోలు అలాగే ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇట్టి సందర్భంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణచారి మాట్లాడుతూ ఏర్గట్ల పాఠశాల జూనియర్ అసిస్టెంట్ కోమలి, దాదాపు నాలుగు సంవత్సరాల పాటు పాఠశాలలో విధులను చక్కగా నిర్వర్తించి, కంప్యూటర్ వర్క్,బిల్స్, అలాగే ప్రభుత్వం ఇచ్చిన జీవోలు మొదలైన విషయాలను తాను చెప్పినట్లు విధులను ఎంతో చక్కగా నిర్వర్తించారని అలాగే పాఠశాల అభివృద్ధిలో తన వంతు బాధ్యతను చేపట్టిన జూనియర్ అసిస్టెంట్ కోమలి చాలా గొప్పవారని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి తెలిపాడు.అలాగే పాఠశాలలో తన తోటి ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ఉపాధ్యాయులు జూనియర్ అసిస్టెంట్ కోమలి గురించి మాట్లాడుతూ తమ పాఠశాలకు సంబంధించిన ప్రతి విషయాన్ని ఎంతో ఓపికగా నిర్వర్తిస్తూ క్రమబద్ధతతో చెప్పే ప్రతి విషయాన్ని తప్పకుండా చేస్తాను అని దృఢ సంకల్పంతో పనులను విజయవంతంగా పూర్తి చేసిన కోమలి ని ఏర్గట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆమె సేవలను కొనియాడారు. జూనియర్ అసిస్టెంట్ సన్మాన గ్రహీత కోమలి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణ చారి,తోటి ఉపాధ్యాయుల సహకారంతోనే విధులను చక్కగా నిర్వర్తించానని, సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని తెలిపారు.బదిలీపై వెళ్లిన కోమలి కి పాఠశాల బృందం ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మునిరుద్దీన్,ప్రసాద్, సమిత,రాజ నరసయ్య, గంగాధర్,ప్రవీణ్ శర్మ, ట్వింకిల్,గంగా మోహన్, సబిత,జ్యోతి,రిషిక, కృష్ణవేణి,శ్యామల, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడా పోటీలు షూరు

## క్రీడలు ప్రారంభించిన ఎంపిడిఓ

భీమ్ గల్, బతుకమ్మ మండలంలోని బాబానగర్ గవర్నమెంట్ స్కూల్ లో నిర్వహిస్తున్న మండల క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల క్రీడాలను మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ సంతోష్ కుమార్ లంచనంగా ప్రారంభించారు. ఈ క్రీడల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని, మార్చ్ ఫస్ట్ నిర్వహించి,క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ స్వామీ, గ్రామ సర్పంచ్ స్వామీ, మండలంలోని వివిధ పాఠశాలల హెడ్ మాస్టర్లు, వ్యాయమ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీల అమలు విఫలం పై రుద్రూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో బాలగంగాధర్ కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ గాండ్ల మధు, దౌర్ సాయిలు, బొట్టే గజేందర్, ప్రవీణ్, వంజరి గోపి, బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు జువ్వల శ్రావణ్, సలీమ్, పార్వతి రాములు, పార్వతి ప్రవీణ్, శివకుమార్, అర్రోళ్ల శంకర్, సాయికిరణ్, వీరన్న, సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కోర్ కమిటీలో ఇద్దరికి చోటు





నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కోర్ కమిటీ సభ్యులుగా నిజామాబాద్ కు చెందిన రిటైర్డ్ ఉద్యోగులకు స్థానం దక్కింది. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ నగరానికి చెందిన సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు రేణికుంట నాంపల్లికి మాదిగ ఉద్యోగుల జాతీయ కోర్ కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు నాంపల్లి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కోర్ కమిటీలో తీసుకున్నందుకు మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను రెట్టింపు ఉత్సాహంతో చేస్తూ మాదిగ ఉద్యోగుల సమైక్యను బలోపేతం చేస్తానని తెలిపారు. నిజామాబాద్ నగరానికి చెందిన తెడ్డుగంగారాంకు ఎంఈఎఫ్ జాతీయ కమిటీ కోర్ కమిటీలో స్థానం కల్పించారు. ఈ సందర్భంగా తెడ్డు గంగారాం మాట్లాడుతూ 2002 లో మంద కృష్ణ మాదిగ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల ప్రమోషన్లలో రిజర్వేషన్లలు కోసం పోరాడుతున్న సమయంలో తనను నిజామాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రమోషన్ల రిజర్వేషన్ల సాధన సమితి కో ఇంచార్జిగా నిజామాబాద్ జిల్లాకు నియమించారు. ఆ తర్వాత 2010 లో ఎంఈఎఫ్ నిజామాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా, ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, అలాగే ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారన్నారు. ఇప్పుడు ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ సభ్యులుగా నియమించడం జరిగిందన్నారు. ఇలాంటి అత్యున్నత పదవులలో పని చేయడానికి నాకు ఇప్పటి వరకు శక్తిని ఇచ్చి సహకారాన్ని అందించిన ఎంఈఎఫ్ జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన నిజామాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్ పీ, ఎంఈఎఫ్, ఎంఎంఎస్, ఎంఎస్ఎఫ్ నాయకత్వానికి కూడా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## న్యాయవృత్తి హక్కుల సాధనకై
# న్యాయవాద పరిషత్ కృషి




నిజామాబాద్ లీగల్, బతుకమ్మ : న్యాయవాది పరిషత్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జిల్లా కోర్టు భవనంలోని బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు కృష్ణానంద్ మాట్లాడుతూ న్యాయవాదుల వృత్తిపరమైన రక్షణకే న్యాయవాది పరిషత్ కృషి చేస్తుందని, చట్ట పరమైన సంస్కరణలకు ఆలోచన సంక్షేమకై దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ఏకైక సంస్థ న్యాయవాద పరిస్థితి పేర్కొన్నారు., న్యాయవాదుల అభ్యున్నతి కై న్యాయవాదులందరు పరిషత్తో కలిసి రావాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో న్యాయవాద సమాజంలో అఖిల భారతీయ అదివత్త పరిషత్ గా ప్రారంభమై రాష్ట్రంలో తెలంగాణ న్యాయవాద పరిషత్ ఆవిర్భవించి భారతీయ సంస్కృతి నైతిక విలువ వృత్తి గౌరవం సమాజ శ్రేయస్సు జాతీయ వాద దృక్పథం తో న్యాయవాద పరిషత్ న్యాయ రంగంలో పనిచేస్తుందని న్యాయవాదుల సంక్షేమం కోసం సమాజాభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా తమతో కలిసి పని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ సుభాష్ రెడ్డి, న్యాయవాదులు ఎర్రం విఘ్నేష్, వసంత్ రావు, మానిక్ రాజ్, ఆశ నారాయణ, బంటు వసంత్,సంతోష్ నాగ్,ఉదయ్ రోహన్ ,కార్తీక్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



## సోలార్ పవర్ ప్లాంట్ కు భూమి పూజ



ఇందూర్ బతుకమ్మ : నగరంలోని ఆర్య నగర్ లో గల సెక్షన్ 7 పరిధిలో ఉన్న ఖాళీ స్థలంలో సోలార్ పవర్ ప్లాంట్ కోసం ఎస్ఈ సోమవారం భూమి పూజ చేశారు. ఇందులో 1.2 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి తయారయ్యే విదంగా సోలార్ ప్లాంట్ ను నెలకొల్పాలని కంపెనీ సిఏండి ఆదేశించారు. ఇది ఏర్పాటు అయితే వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కానుంది. దీనిలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కన్స్ట్రక్షన్ డిఈఈ వెంకటరమణ, బోధన్ డిఈఈ ముక్తార్, సిబ్బంది పాల్గొన్నారు

## మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

నందిపేట్, బతుకమ్మ. : నందిపేట్ మండల కేంద్రం లోని ప్రైవేట్ స్కూల్స్, గవర్నమెంట్ స్కూల్స్ కు సంబంధించిన 7,8,9,10, తరగతి విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం నందిపేట్ ఎస్ఐ వినయ్ ఆధ్వర్యంలో పద్మశాలి కళ్యాణ మండపంలొ యాంటీ డ్రగ్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి వారికి వివరించడం జరిగింది యువత ఎట్టి పరిస్థితి లొ వాటికి బానిసలుగా మారొద్దు వాటి వాళ్ళ జరిగే అనర్థాల గురించి వీడియోలను ప్రదర్శించడం జరిగింది.ఈ కార్యక్రమం లొ పోలీస్ సిబ్బంది ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.



## ఏర్గట్ల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో
# మండల ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు





ఏర్గట్ల, బతుకమ్మ : మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు13 డిక్లరేషన్లు 6 గ్యారంటీలు అమలు చేస్తామని, రెండు సంవత్సరాలు అయిన అమలు చేయకమోసం చేసినందుకు ఆడబిడ్డలకు నెలకు 2500/రూపాయలు, కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం, మహిళలకు స్కూటీ, ఇస్తానని రైతులకు రైతు భరోసా 2000/రూపాయలు పెంచి ఇస్తానని 24 గంటలు ఉచిత విద్యుత్, రైతు కూలీలకు12000/వేల రూపాయలు, ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, వృద్ధులకు, వికలాంగులకు, వితంతులకు,ఒంటరి మహిళలకు,బీడీ కార్మికులకు,4000/పింఛన్, గ్రామాల్లో ఆటోలు నడిపే ఆటో డ్రైవర్లకు12000/వేలు విద్యార్థులకు ఫీజు బకాయిలు,బిసి, ఎస్సీ,ఎస్టి,మైనార్టీ, యువజన, రైతు డిక్లరేషన్ ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చనందుకు సీఎం రేవంత్ రెడ్డి పై ఏర్గట్ల మండల ప్రజా పరిషత్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఏర్గట్ల మండల ప్రజల పక్షాన ఫిర్యాదు పత్రం అందజేశారు.అలాగే

### బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

హైదరాబాదులో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ కి వెళ్లకుండా అక్రమంగా సీఎం రేవంత్ రెడ్డి అరెస్టు చేసినందుకు నిరసనగా ఏర్గట్ల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఏర్గట్ల మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద గల శివాజీ,తెలంగాణ తల్లి, విగ్రహాల వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పూర్ణానందం,ఏర్గట్ల గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి,ధోశీచంద గ్రామ సర్పంచ్ పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి,బట్టపూర్ గ్రామ సర్పంచ్ భూషణ వేణి ప్రవీణ్ యాదవ్,ఏర్గట్ల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ బర్మ చిన్న నరసయ్య,మాజీ ఎంపీటీసీ డాక్టర్ మధు,సున్నపు అంజయ్య,ఏర్గట్ల గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దేవుడు నరసయ్య,నేరళ్ల లింగారెడ్డి,తుపాకుల శ్రీనివాస్ గౌడ్,తొర్తి బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏశాల నర్సారెడ్డి,బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జక్కు గంగాధర్,మాజీ సర్పంచ్ ఆకుల రాజారెడ్డి, మాజీ సర్పంచ్ కుండ నవీన్,మాజీ ఉప సర్పంచ్ తాహెర్,మాజీ క్యాతం దేవా రెడ్డి,టిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఈజప నడిపి రాజన్న,నాగిరెడ్డి రాజేందర్, గన్నారపు రాజేశ్వర్,ఈర పట్నం నరేష్,బద్దం ప్రభాకర్,బద్దం హనుమా డ్లు,ఏలేటి బాలకిషన్,బర్మ నరేష్,రెక్కెడ మోహన్,కుష లింబాద్రి,జైన్,గుండ్ల గంగాధర్,మచ్చ లక్ష్మణ్,మండల పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కృషి

### అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ తోనే సాధ్యం
### జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు
### తారాచంద్ నాయక్



ఇందల్వాయి, బతుకమ్మ : రాష్ట్ర అభివృద్ధి లక్ష్యం గా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూస్తూ బీఆర్ ఎస్ పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీ పై ఆరోపణలు చేయడం మానుకోవాలని మాజీ ఐ డి సి ఎం ఎస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తారాచంద్ నాయక్ హెచ్చరించారు,
, ఈ మే రకు ఆయన ఇందల్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తీర్మాన్ పల్లి సర్పంచ్ చింతల కిషన్ తో కలిసి సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు, కేవలం టిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీపై బురద చల్లి మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు,
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతల కిషోర్ మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ కేవలం పార్టీ మనుగడ కోసం కొత్త కొత్త నాటకాలు ఆడుతున్నారన్నారు, బిఆర్ఎస్ పార్టీ పది ఏళ్లుగా అధికారంలో ఉండి ఏం సాధించక ప్రజలను దోచుకుందని కేవలం పామ్ హౌస్ కే వాళ్ళ పాలనపరిమితమైందన్నారు .కేసీఆర్ లక్షల కోట్ల అప్పు చేశాడని ఆరోపించారు. అప్పులు తీర్చడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో ఎంతో అభివృద్ధి సాధించి ప్రజల సంక్షేమం కొరకు పాటుపడుతున్నాడని అన్నారు.
మళ్లీ కాంగ్రెస్ పార్టీ 2034 వరకు అధికారంలో ఉంటుందని ఇది గమనించి బి ఆర్ఎస్ పార్టీ వాళ్లు భయపడుతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రము ఇచ్చింది సోని యా గాంధీ. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నాయకత్వం మరియు రూరల్ శాసనస భ్యులు డాక్టర్ భూపతి రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల కిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు,పారదర్శకమైన పాలన అందిస్తూ అన్ని వర్గాల వారికి అన్ని పార్టీల వారికి ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, కల్యాణ లక్ష్మి పథకాలు నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ సొంతం అన్నారు.. ప్రజలు టిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను గమనిస్తున్నారని గుర్తు చేశారు, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెసు పార్టీ ఆదరిస్తున్న విషయం చూసి బి.ఆర్ఎస్ పార్టీ ధ్యేయంగా పనిచేస్తుందని ప్రజలు ఆదరిస్తున్నారని మళ్ళీ 2034 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ రాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## చంద్రాయన్ పల్లి సర్పంచ్ రఘు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

ఇందల్వాయి సెప్టెంబర్ 7 బతుకమ్మ ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్ పల్లి గ్రామ సర్పంచ్ ఆరేటి రఘు కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ ఆధ్వర్యంలో పరామర్శించారు, ఇటీవల చంద్రన్ పల్లి సర్పంచ్ రఘు మాతృమూర్తి ఆరేటి బాలవ్వ గ్రామ సర్పంచ్ గా ఐదేళ్లు పాలించారు, కానీ అనారోగ్య కారణాల వల్ల మాజీ సర్పంచ్ బాలవ్వ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ తో సహా మండలంలోని ముఖ్య నేతలు పరామర్శించి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంగా దాసు, గడ్కోల్ శ్రీనివాస్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మోహన్ నాయక్, నల్లవెల్లి మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, కుమార్, చందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు



## బైక్ ప్రమాదంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఆపరేటర్ మృతి



నందిపేట్, బతుకమ్మ : డొంకేశ్వర్ మండలకేంద్ర పరిధిలోని గంగాసముందర్ గ్రామానికి చెందిన ఉస్సన్న (45) అనే వ్యక్తి బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ఉస్సన్న గత 8 నెలలుగా మారంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ వద్ద ఆపరేటర్గా పనిచేస్తున్నాడు. రోజూలాగే ఆదివారం ఉదయం 5 గంటలకు తన టీవీఎస్ మోటార్ సైకిల్ ఏపి 01ఏఈ 1309పై పంప్ హౌస్కు వెళ్లాడు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా, లిఫ్ట్ రోడ్ గుట్ట (కొండ) ప్రాంతంలో ఎదురుగా అడవి పంది అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి మట్టి రోడ్డుపై కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ముఖానికి తీవ్ర గాయాలు కావడం తో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గమంచిన సంతోష్ మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.మృతుడి మేనల్లుడు అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు నందిపేట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ వినయ్ పేర్కొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

## మృతదేహంతో ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన






నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : జిల్లా కేంద్రంలోని ప్రగతి ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. కాళ్లు చేతుల నొప్పులతో ఆసుపత్రికి వచ్చిన వ్యక్తికి వైద్యులు సరైన వాద్యం అందించకపోవడంతో మృతి చెందాడు. వ్యక్తి మృతితో తీవ్ర ఆవేదనకు గురైన బంధువులు మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు చేపట్టారు. తన తండ్రి మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి కొడుకు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. డా. భరత్ వద్ద చికిత్స పొందిన సుదర్శన్ విషయంలో అనుమానాస్పద వైద్య నిర్లక్ష్యం, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా 10 ఎంజి మత్తు/సెడేటివ్ ఇంజెక్షన్ ఇవ్వడం, సరైన పర్యవేక్షణ లేకపోవడం, అనంతరం రోగి పరిస్థితి విషమించి వెంటిలేటర్‌పైకి వెళ్లిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవలసిందిగా మృతుడి కొడుకు శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ జిల్లా పోచంపాడు గ్రామం కు చెందిన సుదర్శన్ కు చేతులు,కాళ్లు సరిగా కదలకపోవడంతో వైద్య చికిత్స కోసం గత నెల 31వ తేదీన సాయంత్రం 5 గంటలకు ప్రగతి హాస్పిటల్, నిజామాబాద్‌లో చేర్పించారు. అక్కడ డా. భరత్ పర్యవేక్షణలో చికిత్స అందిం చారు.రోగికి సీటిస్కాన్ నిర్వహిం చగా స్కాన్ లో సాధారణంగానే ఉందని, రోగిని ఒక రోజు పర్యవే క్షణలో ఉంచుతామని వైద్యులు తెలిపారు. తరువాతి రోజు 31 వ తేదీన మధ్యాహ్నం వరకు, రోగి పరిస్థితి మెరుగుపడినట్లు కనిపిం చింది. రోగి స్వయంగా తాను కోలుకున్నానని ఇంటికి వెళ్లాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. అయితే డా. భరత్ రోగి ఇంకా ఒక వారం రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉండాలని అనంతరం జనరల్ వార్డుకు పంపిస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు. కానీ మా అనుమతి లేకుండానే మోతాదుకు మించి మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో తన తండ్రి చనిపోయాడని దీనిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఆస్పత్రి ఆందోళనతో 1వ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు

# కాంగ్రెస్ దుశ్శసనపర్వంతో మహిళలోకానికి దుర్దినం



నిజామాబాద్ లీగల్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్ర శాసన సభ ప్రాంగణం సాక్షిగా మహిళలోకానికి తీరని అవమానం జరిగిందని నిజామాబాద్ జిల్లా భారత రాష్ట్ర సమితి లీగల్ సెల్ కన్వీనర్ దాదన్నగారి మధుసుదన్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు, మాజీమంత్రులు, ప్రస్తుత శాసన సభ్యుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం దుశ్శసన రీతిలో వ్యవహరించడం సభ్య సమాజానికి కలంకం తెచ్చిపెట్టిందని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన ఖండించారు. ముఖ్యంగా మహిళ శాసన సభ్యుల పట్ల మ్యాన్ హ్యాండిల్ చేయడం ఘోర తప్పిద్ధామన్నారు.నల్ల దుస్తులతో వెళ్లి నిరసన తెలపడం చట్ట సమ్మతమేనని అదీ తెలంగాణ మలిదశ ఉద్యమం నేర్పిన పాఠమని అన్నారు.తెలంగాణ ఉద్యమం చేయని వాళ్లు ప్రభుత్వాన్ని నడిపిస్తే నిరసనను కూడా చూసి భయపడతారని నేటి సంఘటనను చుస్తే అర్థం అవుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కట్టుతప్పివ్యవహరించి ప్రజాస్వామ్యం అబాసుపాలు కావడానికి కారకులయ్యారని ఆరోపంచారు.భారాస శాసనసభ్యులపై భౌతిక దాడులకు పాల్పడిన పోలీసులపై, వారికి సహకరించి?ప్రోత్సహించిన కాంగ్రెస్ నేతలపై చట్టపరమైన చర్యలకు మధుసుధన్ రావు డిమాండ్ చేశారు.

# గోనుగొప్పులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు హర్షనీయం

## సర్పంచ్ సేపూర్ గణేష్



భీమ్ గల్, బతుకమ్మ :మండలంలోని గోనుగొప్పుల గ్రామం లో తెలంగాణా పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం హర్ష నీయమని గ్రామ సర్పంచ్ చేపూరు గ్రామ సర్పంచ్ చరణ్ గౌడ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన 73 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ కు మంజూరు చేయడం జరిగిందని, అందులో గోనుగొప్పుల ఒకటి కావడం గొప్ప విషయమని అన్నారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు మండల, గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# గూపన్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

## ప్రజావాణిలో పీడీఎస్ యు వినతి




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని గూపన్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ సురేష్ కి పీడీఎస్ యు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ యు నగర అధ్యక్షులు ఎం.డి. నసీర్, నగర ప్రధాన కార్యదర్శి ఆర్. వినోద్ కుమార్ లు మాట్లాడుతూ?పాఠశాలలో సుమారు 130 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నప్పటికీ వారికి సరిపడా కనీస మౌలిక వసతులు లేవని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బాలికలు మరింత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం రెండు మూత్రశాలలు మాత్రమే ఉండటం సిగ్గుచేటన్నారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, తరగతి గదులు,పరిశుభ్రత తదితర సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, అందరికీ యూనిఫాం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పాఠశాలకు అందుతున్న అమ్మఒడి??ఇతర ప్రభుత్వ నిధులను ఏ విధంగా వినియోగించారో అంశంపై సమగ్రంగా పరిశీలించి, అవసరమైన నిధులను పాఠశాల అభివృద్ధికి వినియోగించాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలను క్షేత్రస్థాయిలో సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, కాలపరిమితిలో అన్ని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని చేపడతామని పీడీఎస్ యు?నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు?నగర సహాయ కార్యదర్శి ఆల్గోట్ సృజన్, నగర కోశాధికారి మణితేజ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ డిఈఈకి ఎస్ఈగా పదోన్నతి



ఇందూర్, బతుకమ్మ: నిజామాబాద్ డిఈఈ ఎం. శ్రీనివాస్ కు తాత్కాలిక పద్ధతిలో ఎస్ఈ గా పదోన్నతి లభించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కు ఎస్ఈ గా చేరాలని సిఎండి ఉత్తర్వులు జారీ చేసారు.

# విద్యాభ్యాసంతో వింధ్య పర్వతాలంత ఎదగాలి

## -సీనియర్ సివిల్ జడ్జి నీలిమ



నిజామాబాద్ లీగల్, బతుకమ్మ :విద్యాభ్యాసం చేసే సమయంలో విద్య విషయాలతో పాటు చట్టసంబంధిత విషయాలు కొన్ని తెలుసుకోవాలని నిజామాబాద్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ముద్దసాని నీలిమ తెలిపారు. నగరంలోని గొల్లగుట్టలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ మహిళ గురుకుల కళాశాలను ఆమె సోమవారం సందర్శించి కళాశాల ప్రాంగణమంత కలియ తిరిగి అనంతరం విద్యార్థినిలతో ముచ్చటించారు.మనసులో ఏకాగ్రతను నింపుకుని చదువుల తల్లి ఒడిలో వింధ్య పర్వతాలంత ఎత్తుకు ఎదగాలని జడ్జి నీలిమ ఉద్బోదించారు. ఎదిగేక్రమంలో చట్టాల గూర్చి తెలుసుకోవలసిన అవసరం, ఆవశ్యకత ఉన్నదని ఆమె తెలిపారు.పోక్సో చట్టం బాలబాలిక రక్షణ కోసం అమలవుతున్న బలమైన చట్టమని తెలిపారు.ఆడవారి పట్ల మగవారు ప్రవర్తించే విధానం ఎలా ఉంది అది ఆడవారి గౌరవాన్ని అగౌరవ పరిచే విదంగా ఉందా.. లేదా అనేది అంచనావేసుకోవచ్చని అన్నారు. స్పర్శ తీరునుబట్టి మగవారి ఆలోచన ఏమిటో తెలుసుకోవచ్చని వివరించారు. బాలబాలికలపై నేరాలు చేసినవారు పోక్సో చట్ట ప్రకారం కఠిన శిక్షలకు అర్హులు అవుతారని జడ్జి నీలిమ తెలిపారు. విద్యార్థుల దైనందిన ఆర్థిక వ్యవహారాలలో స్మార్ట్ ఫోన్ ను ఉపయోగించే క్రమంలో సైబర్ నేరానికి ఎర కావదన్నారు. దాని మూలంగా డబ్బును పోగొట్టుకుని బాధ పాడరాదని జాగ్రత్తగా మసలుకోవాలని అన్నారు. ఒకవేళ సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీస్ సైబర్ సెల్ ను ఆశ్రయించి పిర్యాదు చేసి త్వరతగతిన ఫలితాన్ని పొందవచ్చని ఆమె తెలిపారు.



# రోడ్డు ఆక్రమణల నుండి బీడీ కార్మికుల ప్లాట్లను కాపాడాలి

ఇందల్వాయి,బతుకమ్మ:ఇందల్వాయి గ్రామ పంచాయతీ పరిధిలో బీడీ కార్మికులకు కేటాయించిన ప్లాట్లలో రోడ్లు ఆక్రమణకు గురవుతున్నాయని, అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక నివాసి గొల్ల సాయిలు కోరారు. ఈ మేరకు ఆయన ఇందల్వాయి గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి , గార్లకు వినతిపత్రం సమర్పించినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు గత సంవత్సరంలో తేదీ 17-3 -2025 నాడు గ్రామపంచాయతీ కార్యదర్శి కి మరియు ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించినప్పటికీ ఇలాంటి చర్యలు చేపట్టలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.గత 25 సంవత్సరాల క్రితం వీకర్ సెక్షన్ కింద బీడీ కార్మికులకు 144 గజాల చొప్పున ప్లాట్లను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అయితే, కొంతమంది వ్యక్తులు రోడ్లను ఆక్రమించుకుని ఇళ్లను నిర్మించడంతో పాటు, మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్లు వెళ్లిన దారిని కూడా ఆక్రమించారని ఆరోపించారు. ముని రాజన్న మరికొందరు కలిసి రోడ్డుకు ఆనుకుని మొక్కలు నాటడం, కూరగాయలు పెంచడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు.కనీసం నడవడానికి కూడా దారి లేకుండా ఆక్రమణలు చేపట్టారని, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వాస్తవాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ ఆక్రమణల బారిన పడకుండా బీడీ కార్మికుల ప్లాట్లకు వెళ్లే రహదారులను కాపాడాలని ఈ సందర్భంగా స్థానికులు అధికారులను కోరారు.

